సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ౹ 28 ౹ నవంబర్ ౹ 2023



బీఆర్‌ఎస్, బీజేపీ తోడుదొంగలు

బీజేపీ, బీఆర్‌ఎస్ తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ విమర్శించారు. 6లో



ఓట్ల వరకే మనుషులు..

ఆదివాసీ గూడేలలో అభివృద్ధి మాటేమో కానీ కనీస వసతులు లేక ప్రజలు అల్లాడిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. 6లో

గరిష్టం / కనిష్టం
30° / 20°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత కొంత అధికంగానే ఉంటుంది. రాత్రికి మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం చండీహోమం నిర్వహించారు. మేళతాళాలు, వేద మంత్రాల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజ అనంతరం చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అంతకు ముందు దేవస్థానంలోని శివలింగానికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. ఆ తర్వాత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ ఎస్.రజినీకుమారి, అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి మద్యం షాపుల మూసివేత

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు మద్యం దుకాణాలు మూసి వేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. ఓట్ల లెక్కింపు జరిగే డిసెంబర్ 3వ తేదీన కూడా ఉదయం 6 గంటల నుంచి ఫలితాలు వెలువడేంత వరకు మూసి ఉంచాలని పేర్కొన్నారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు, డిసెంబర్ 3వ తేదీన జిల్లాలోని వైన్, బార్‌షాపు బంద్ చేయాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి జానయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పొత్తులో కత్తులు !

బీజేపీ కనీస ధర్మం పాటించడం లేదంటున్న జనసేన

- ప్రచారంలో సహకరించడం లేదని లక్కినేని ఆరోపణ
- 'కమలం' జిల్లా అధ్యక్షుడి ఇంట్లో పంచాయితీ
- నిబంధనల మేరకే పని చేస్తున్నామంటున్న కమలదళం



వాగ్వాదానికి దిగిన రంగాకిరణ్, లక్కినేని సురేందర్‌రావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారతీయ జనతా పార్టీ, జనసేన మధ్య నెలకొన్న ఎన్నికల పొత్తులో కత్తులు విప్పుకున్నాయి. ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు తనకు సహకరించడం లేదని జనసేన అభ్యర్థి ఆరోపణలు చేశారు. ప్రచారం ముగియడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు చేసిన ఈ ఆరోపణలు ఇరు పార్టీ వర్గాల్లో సంచలనంగా మారాయి.

జనసేన జగడం..

జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో గణనీయమైన ప్రభావం చూపే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ గడిచిన ఐదేళ్లుగా వ్యూహాలు రూపొందిస్తోంది. జిల్లాలో ఐదు స్థానాల నుంచి పోటీకి సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో జనసేనతో ఎన్నికల పొత్తు కుదరడంతో కొత్తగూడెం, అశ్వారావుపేట స్థానాలు ఆ పార్టీకి కేటాయించారు. ఈ మేరకు జనసేనతో పాటు బీజేపీ అభ్యర్థుల కోసం స్టార్ క్యాంపెయినర్ పవన్‌కళ్యాణ్ జిల్లాలో ఓ ప్రచార సభలో కూడా పాల్గొన్నారు. ఇక ఒక్క రోజుతో ప్రచార పర్వం ముగుస్తుందనగా ఇరు పార్టీల మధ్య సఖ్యత లేదనే అంశం బట్టబయలైంది. అభ్యర్థిగా నామినేషన్ వేసినప్పటి నుంచీ.. బీజేపీ నాయకత్వం తనకు సంపూర్ణ సహకారం అందివ్వడం లేదంటూ కొత్తగూడెం జనసేన అభ్యర్థి లక్కినేని సురేందర్ ఆరోపిస్తున్నారు.

ఇదేం పంచాయితీ..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ఇంట్లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో.. పొత్తు ధర్మం పాటించకుండా తనకు అన్యాయం చేస్తున్నారని లక్కినేని సురేందర్ ఏకంగా బీజేపీ జిల్లా నాయకత్వంపై ఆరోపణలు చేశారు. తన తరఫున బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్ ఒక్కరే ప్రచారం చేశారని, అప్పుడు ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. ఆ తర్వాత అగర్వాల్ బీజేపీని వీడి బయటకు వెళ్లారని, అనంతరం ప్రచారంలో బీజేపీ నేతల నుంచి తనకు సరైన సహకారం లేకుండా పోయిందని వాపోయారు. చివరకు తన తరఫున ఎవరైనా ప్రచారంలో పాల్గొన్నా వారిపై బీజేపీ జిల్లా నాయకులు ఒత్తిడి చేసి తనకు దూరం చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. పోలింగ్‌కు గడువు దగ్గర పడిన తర్వాత బూత్ కమిటీలు వేయడానికి కూడా బీజేపీ నుంచి ఎలాంటి మద్దతు లేదన్నారు. సుజాతనగర్ మండలంలో తప్ప మరెక్కడా కమలదళం నుంచి సరైన సాయం అందలేదన్నారు. పొత్తు ధర్మాన్ని అసలు పాటించకుండా తనను బలిపశువు చేశారంటూ విమర్శలు చేశారు.

గ్లాసుకు పగుళ్లు..

ఎన్నికల పొత్తులో కొత్తగూడెం సీటు జనసేనకు కేటాయించిన సమయంలో ఆ పార్టీకి ఇక్కడ చెప్పుకోదగ్గ నాయకుడు లేరు. ఆ పార్టీకి జిల్లాలో సంస్థాగత నిర్మాణం లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో అప్పటికే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన లక్కినేని సురేందర్ మరోసారి కండువా మార్చి జనసేనలో చేరారు. దీంతో ఆయన ఆ పార్టీ తరఫున కొత్తగూడెం అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గత రెండు వారాలుగా 'గ్లాసు గుర్తుకే ఓటెయ్యండి' అని ప్రచారం కూడా చేశారు. కానీ ఇంతలోనే పరిస్థితులు తారుమారయ్యాయి. సంస్థాగత నిర్మాణం, ప్రణాళిక లేకుండా బరిలో నిలిచిన 'గాజు గ్లాసు'లో చివరి దశలో పగుళ్లు వచ్చాయి.

దబాయింపు సరికాదు

బీజేపీ పార్టీ నిర్దేశించిన లక్ష్యాలు, నిబంధనలు పాటించడంలో మేము ఎక్కడా పొరపాటు చేయలేదు. అలసత్వం వహించలేదు. పొత్తు ధర్మాన్ని పాటించడంలో పార్టీ అధిష్టానం నిర్ణయించిన విధివిధానాల మేరకే పని చేస్తున్నాం. కానీ జనసేన అభ్యర్థి మనసులో వేరే ఉద్దేశాలు, లక్ష్యాలు పెట్టుకుని బీజేపీపై బురద జల్లుతున్నారు. ఇరు పార్టీల మధ్య సమన్వయం కోసం ఏర్పాటు సమావేశంలో ఆయన దబాయించినట్టుగా మాట్లాడటాన్ని, అనుచిత ప్రవర్తనను ఖండిస్తున్నా.

– కుంచె వెంకట రంగాకిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వైభవంగా కృత్తికా దీపోత్సవం..

- రామయ్యకు కనులపండువగా స్నపన తిరుమంజనం
- పోటెత్తిన భక్త జనం



స్వామివారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు



ఉమామహేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి కనుల పండువగా కృత్తికా దీపోత్సవం నిర్వహించారు. తొలుత తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి ఉత్సవ మూర్తులను, ఆళ్వార్‌లను పల్లకీ సేవగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివార్లకు 25 కలశాలతో స్నపన తిరుమంజనం, పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అనంతరం హారతి సమర్పించారు. కృత్తికాదీపోత్సవం సందర్భంగా సాయంత్రం హోమ గుండం నుంచి తీసుకొచ్చిన జ్వాలతో దీపాలను వెలిగించారు. పౌర్ణమి రోజున కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం రామాలయంలో కృత్తికా దీపోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ఇందులో భాగంగా చొక్కాసుర వధ, దహనం, తిరువీధి సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకల నేపథ్యంలో రామయ్య నిత్యకల్యాణాన్ని సోమవారం నిలిపివేశారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు..

కార్తీక పౌర్ణమి సోమవారం రావడంతో భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆ తర్వాత స్వామివారి దర్శనానికి రామాలయానికి పోటెత్తారు. ఆలయంలో నిర్వహించిన సత్యనారాయణ వ్రతాల్లో భారీగా భక్తులు పాల్గొన్నారు. రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ రామలింగ ఉమామహేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు.



గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు

భక్తజన సంద్రంగా గోదారి తీరం

భద్రాచలంటౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీగా తరలిరావడంతో గోదావరి తీరంలో సందడి నెలకొంది. మహిళలు గోదారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. నదీ తీరంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామివారి ఆలయాలతో పాటు రామాలయంలో పూజలు నిర్వహించారు.

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవాలి
- బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలి
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య, పక్కన పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

ఇల్లెందు: రాష్ట్రంలో తెలంగాణ ద్రోహులను తరమికొట్టి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుందామని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బొగ్గు గనులకు నిలయమైన ఇల్లెందు ప్రాంతంలో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, బొగ్గు గనులను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దాన్ని అడ్డుకుంటామని చెప్పారు. అంతేకాకుండా సింగరేణి ఉద్యోగుల ఆదాయపన్ను, పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పోడు పట్టాల కోసం 13 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే నాలుగు లక్షల మందికి మాత్రమే అందించి చేతులు దులుపుకున్నారని, ఇందిరమ్మ రాజ్యం రాగానే అర్హులైన ప్రతి గిరిజనుడికీ పట్టాలు ఇస్తామని చెప్పారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ, సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామన్న కేసీఆర్ నేటికీ చుక్క నీరు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు గ్యారంటీల్లో నాలుగు అమలు చేస్తోందని, మరొకటి త్వరలోనే చేయబోతోందని తెలిపారు. తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో కాంగ్రెస్ నేత సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే బోడు, కొమురారం మండలాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.1,100 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశానని తెలిపారు. 35 ఏళ్ల కాలంలో ఇల్లెందు రూపురేఖలు మార్చిన ఘనత తనదేనన్నారు. గ్రామాలకు లింక్, ప్రధాన రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం, పట్టణంలో రూ.120 కోట్లతో పలు పనులు చేపట్టామని తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఇప్పటికైనా ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే తనను గెలిపించాలని కోరారు. సభలో ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజు, ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, టీజేఎస్ జిల్లా కన్వీనర్ మల్లెల రామనాథం, తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ ఈసం నర్సింహారావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు దొడ్డా డానియేల్, పులి సైదులు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, జానీ, గోచికొండ శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రలోభాలతో ఎర..

- జిల్లాలో జోరుగా నగదు, మద్యం పంపిణీ
- ఏజెన్సీ నియోజకవర్గాల్లోనూ రూ.కోట్లు ఖర్చు చేస్తున్న పార్టీలు
- కులాల వారీగా మందు.. విందు భోజనాలు



బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. ఎన్నికలకు రెండురోజులు గడువు ఉండగానే డబ్బు, మద్యం పంపిణీ ప్రారంభించాయి. ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు రూ.కోట్లలో నగదు పంపిణీ చేస్తున్నాయి. గ్రామాలలో ఏరియాలు, కులాల వారీగా విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. మద్యం ప్రియులకు వారం రోజులకు సరిపడా మందు అందిస్తున్నారు. జిల్లాలోని ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలైన పినపాక, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేటతో పాటు జనరల్ స్థానమైన కొత్తగూడెంలో ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బు అందిస్తున్నారు. గత మూడు రోజులుగా ప్రతీ గ్రామంలోనూ మద్యం ఏరులై పారుతోంది.

కొత్తగూడెంలో పోటాపోటీ..

కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌గా జలగం వెంకట్రావు పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురూ ఓటర్లకు హామీలతో పాటు భారీగా తాయిలాలు అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ ఎన్నికలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ఇక్కడ ఒక్కో ఓటుకు రూ. 2 వేల నుంచి రూ. 4వేల వరకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. నగదుతో పాటు కొన్నిచోట్ల మహిళలకు చీరెలు, వెండి వస్తువులు కూడా అందిస్తున్నారని సమాచారం.

ఒకరిని మించి మరొకరు..

జిల్లాలోని నాలుగు రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు చెందిన ఒక్కో అభ్యర్థి రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు వెచ్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయా స్థానాల్లో ఒక పార్టీ అభ్యర్థి ఓటుకు రూ.1000 చొప్పున ఇస్తే ప్రత్యర్థి పార్టీల వారు రూ.2 వేల చొప్పున పంపిణీ చేస్తున్నారు. పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో ఓ పార్టీ వారు ఇప్పటికే నగదు పంపిణీ ప్రక్రియను దాదాపుగా పూర్తి చేసినట్లు సమాచారం. ఇక ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోనూ ఓటర్లకు నగదు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఎన్నికల అధికారులకు దొరక్కుండా గుట్టుగా సాగిస్తున్నారు. అయితే అక్కడక్కడా నగదు పంపిణీ విషయంలో తేడాలు ఉండడంతో గొడవలు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

నేటితో ముగియనున్న ప్రచారం



కొత్తగూడెంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వానికి మంగళవారం సాయంత్రం 5 గంటలకు తెరపడనుంది. చివరి రోజు ఆయా పార్టీలకు ప్రాబల్యం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని ప్రచారం చేసేందుకు ఆయా నాయకులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇక నేటి రాత్రి నుంచి ఓటర్లను ప్రభావితం చేసే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి దాదాపు 50 రోజుల పాటు ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోయారు. ప్రచార రథాలకు మైక్‌లు ఏర్పాటు చేసి ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని పార్టీల వారు విస్తృతంగా పర్యటించారు.

అగ్రనేతల ఆగమనంతో..

ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు ప్రచారం నిర్వహించారు. దీంతో కేడర్‌లో కొంత జోష్ వచ్చింది. బీఆర్‌ఎస్ నుంచి సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలకు హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ మణుగూరులో రోడ్‌షో నిర్వహించగా, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు ప్రచారం నిర్వహించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఎం అగ్ర నాయకులు సీతారాం ఏచూరి, బృందాకారత్, మాణిక్‌సర్కార్, విజయరాఘవన్ వంటి వారు ప్రచారంలో పాల్గొన్నారు. జనసేన, బీజేపీ అభ్యర్థుల తరఫున పవన్‌కళ్యాణ్, ఈటల రాజేందర్ జిల్లాలో పర్యటించారు.

'గూడెం', భద్రాద్రిలో త్రిముఖ పోటీ..

కొత్తగూడెం నియోజవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి జలగం వెంకట్రావు పోటీ చేస్తున్నారు. ఇక్కడ వీరి ముగ్గురి మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. భద్రాచలంలోనూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేటల్లో మాత్రం బీఆర్‌ఎస్ – కాంగ్రెస్ పార్టీల మధ్యే గట్టి పోటీ ఉండనుంది.

వచ్చే మూడు రోజులు కీలకం

- 30న సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



మాట్లాడుతున్న ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): రానున్న మూడు రోజులు అత్యంత కీలకమని, ఎన్నికల బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మంగళవారం సాయంత్రం 4గంటలకు ప్రచారాలు నిలిపివేయాలని సూచించారు. జిల్లాలో 30వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుందన్నారు. నేటి సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లోకి వస్తుందని, పార్టీలు సభలు, ఇంటింటి ప్రచారం చేయవద్దని చెప్పారు. 29, 30 తేదీల్లో దినపత్రికలు, టీవీ చానళ్లలో ప్రచార ప్రకటనలకు ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. బల్క్ మెసేజ్‌లు, సోషల్ మీడియాల్లో సైతం ఎలాంటి ప్రకటనలు ఇవ్వడానికి అనుమతి లేదన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన వ్యక్తులు నేటి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాను విడిచివెళ్లాలని సూచించారు. డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీపీఆర్ ఓ ఎస్.శ్రీనివాసరావు, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఐఈఓ సులోచనారాణి, యువజన సర్వీసుల అధికారి పరంధామరెడ్డి, డీఎస్‌ఓ రుక్మిణి, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, సీపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు హాజరుకావాలి

ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈవీఎంలు, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలకు తరలింపులో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని ప్రియాంక ఆల కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాధారణ ఎన్నికల పరిశీలకులు కమల్‌కిషోర్, గణేష్, వ్యయ పరిశీలకులు అజయ్‌లాల్‌చంద్ సోనే, పోలీస్ అబ్జర్వర్లు స్వపన్ సర్కార్, జయంత్‌సింగ్, ఎస్పీ డాక్టర్ వినీత్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లు దాటి అనుమతి లేదని చెప్పారు. మెటీరియల్ పంపిణీ, ఈవీఎంల తరలింపు వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ ప్రతినిధులు లక్ష్మణ్ అగర్వాల్, నోముల రమేష్, సత్యనారాయణ, జమలయ్య పాల్గొన్నారు.

జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేశాం

పోలింగ్ ప్రక్రియ నిర్వహణ కోసం జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులు సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు.

తటస్థ ఓటర్లపై దృష్టి

ఇల్లెందురూరల్: ఇప్పటివరకు ముమ్మరంగా ప్రచారం చేసిన అభ్యర్థులు ఇక తటస్థ ఓటర్లపై దృష్టి సారిస్తున్నారు. స్థానిక నేతల నడుమ సయోధ్యకు ప్రయత్నిస్తున్నారు. అన్ని రాజకీయ పక్షాలు వలసలపై ప్రధానంగా దృష్టి సారించగా, ఇతర పార్టీల నుంచి చేరికలు జరిగాయి. దీంతో పాత నేతలు, కార్యకర్తలు అంతర్గత చర్చల్లో అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా, అభ్యర్థులు వారి ఇళ్లకు వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి భవిష్యత్‌కు భరోసా ఇస్తూ, పాత కొత్త నేతలను సమన్వయం చేసుకుంటున్నారు. పార్టీలో చేరడం.. అదే రోజు రాత్రో, మరుసటి రోజో మళ్లీ కండువా మార్చడం.. వంటి పరిణామాలు అభ్యర్థులను అభద్రతకు గురిచేస్తున్నాయి. ప్రచారంలో ఎదురవుతున్న చేదు అనుభవాలను సైతం అభ్యర్థులు కోవర్టు ఆపరేషన్‌గా పరిగణిస్తూ నిరంతరం జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేతలను సమన్వయం చేయాలని ప్రధాన పార్టీలు ఇన్‌చార్జీలను నియమించినా వారి పాత్ర ఇల్లెందులో అంతగా కనిపించడం లేదు. అభ్యర్థులు తమ సొంత అనుయాయులతో పరిస్థితి చక్కబెట్టుకున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ పరిధిలో మండలాల వారీగా సామాజిక లెక్కలను బేరీజు వేసుకుంటూ, కులసంఘాల ప్రతినిధులను మచ్చిక చేసుకుంటున్నారు. కార్తీకమాసం కూడా కలిసి రావడంతో వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు, కార్మిక సంఘాలు తదితర సమూహాలతో సైతం ఆత్మీయ సమ్మేళనాలు పెట్టి చర్చలు జరుపుతున్నారు. బూత్‌ల వారీగా ఓట్ల లెక్కలు తీస్తూ, తమకే ఎక్కువ పడేలా, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారిని రప్పించేలా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారం ఒక ఎత్తైతే, చివరి రెండు రోజులు మరో ఎత్తుగా భావిస్తూ తాయిలాల పంపకాన్ని ఆయా పార్టీలు కీలకంగా భావిస్తున్నాయి.

క్లుప్తంగా

ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేత



నరేంద్ర మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, ఇతర నాయకులు మోదీని కలిసి జ్ఞాపికను అందజేశారు.

బస్సు, లారీ ఢీ : ఒకరికి గాయాలు



పల్లె వెలుగు బస్సును ఢీకొన్న లారీ

దమ్మపేట: రోడ్డుపై ఆగి ఉన్న బస్సును లారీ ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు సత్తుపల్లి నుంచి అశ్వారావుపేటకు వెళ్తోంది. ఈ క్రమంలో మండలంలోని గాంధీనగర్‌లో బస్సు ఆపి ప్రయాణికులను దింపుతుండగా, గ్రానైట్ రాయి లోడుతో అతివేగంతో వెళ్తున్న లారీ, బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశ్వారావుపేట మండలం వడ్డెరంగాపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (60)కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 ద్వారా దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

టపాసులు కాలుస్తుండగా వ్యక్తికి గాయాలు

పినపాక: టపాసులు కాలుస్తుండగా వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గడ్డంపల్లి గ్రామానికి చెందిన కొమరం వినయ్ కుమార్ గ్రామంలో జరుగుతున్న ఓ వివాహ కార్యక్రమంలో టపాసులు కాలుస్తుండగా చేతిలోనే పేలడంతోనే తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్స నిమిత్తం మణుగూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

37 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన దీపక్‌రెడ్డి, పాలిమెర జగదీశ్వర్‌రెడ్డి, మొహ్మద్ నెల్లూరు జిల్లా గూడురులోని ఆదికేశవ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. జల్సాలకు అలవాటు పడ్డ వీరికి పాకెట్ మనీ సరిపోకపోవడంతో అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు నిర్ణయించుకున్నారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దున ఉన్న సీలేరు పరిసర ప్రాంతంలో జగన్నాథ్‌హాండల్ అనే వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా కడప జిల్లాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు రెండు బైక్‌లపై వెళ్తున్నవారిని ఆపి తనిఖీ చేశారు. వారి నుంచి రూ.9.70 లక్షల విలువైన 37 కిలోల గంజాయిని, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా దీపక్‌రెడ్డి, పాలిమెర జగదీశ్వర్‌రెడ్డిలను అరెస్ట్ చేయగా, మొహ్మద్ అనే విద్యార్థి పరారయ్యాడని సీఐ నాగరాజు రెడ్డి, ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండలంలోని రంగువారిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రంగువారిగూడెం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి రూ.17,300 నగదు, 2 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులు

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల నేపథ్యంలో పలు గిరిజన గ్రామాల్లో సోమవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్, ఎక్సైజ్ అధికారులు వేర్వేరుగా సోదాలు నిర్వహించారు. మండలంలోని పండువారిగూడెం, దిబ్బగూడెంలో ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులు నిర్వహించగా, ఓ వ్యాపారి ఇంట్లో మద్యం, నగదు పట్టుబడ్డట్లు ప్రచారం సాగుతోంది. పాపిడిగూడెంలో ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడి ఇంట్లో సుమారు రూ.10వేల విలువైన 63 క్వార్టర్ మద్యం సీసాలు లభ్యమయ్యాయి. దీంతో బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగయ్య తెలిపారు. కాగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల సోదాలు చేసిన మాట వాస్తవమేనని, కానీ మద్యం, నగదు పట్టుబడలేదని ఎస్సై పి. శ్రీకాంత్ తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,196

ఓట్ల వరకే మనుషులు..

- ఎన్నికల తర్వాత విస్మరిస్తున్నారని ఆదివాసీల ఆవేదన
- పాలకులు, ప్రభుత్వాలు మారినా అభివృద్ధికి నోచుకోని ఆవాసాలు
- విద్యుత్, రహదారి, తాగునీటి సౌకర్యం లేక అష్టకష్టాలు
- ఐటీడీఏ పరిధి భద్రాద్రి జిల్లాలో 84 ఆదివాసీగూడేలు



ఆధార్, ఓటుహక్కు కార్డులు చూపుతున్న ఆదివాసీలు



చిరుతానిపాడు గుంపు

దూరప్రాంతాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న ఆదివాసీ గిరిజనులు (ఫైల్)

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కేంద్రంగా గిరిజన సమగ్రాభివద్ధి సంస్థ(ఐటీడీఏ) కొనసాగుతోంది. అయితే, ఐటీడీఏ పరిధిలోని భద్రాద్రి జిల్లాలో నివాసం ఏర్పర్చుకున్న ఆదివాసీ గూడేలలో అభివృద్ధి మాటేమో కానీ కనీస మౌలిక వసతులు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఐటీడీఏ ద్వారా కొంత మేర ఫలితాలు వచ్చినా నూరు శాతం గిరిజనుల సమగ్రాభివృద్ధి జరగలేదని వారి జీవన స్థితిగతలను చూస్తే తెలిసిపోతుంది. పాలకులు ఐదేళ్ల కోసారి మారుతున్నా.. ఎన్నికల వేళ ఈ గూడేలకు బారులుతీరే నాయకులు ఆ తర్వాత ముఖం చూపకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు.

తొలుత ఖమ్మంలో ఏర్పాటు

1975లో తొలుత ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1979లో పాల్వంచకు మార్చారు. ఇక 1993 ఫిబ్రవరి 9న భద్రాచలం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటైంది. భద్రాచలం కొత్తగూడెం జిల్లా పరిధిలో 23 మండలాలు, ఖమ్మం జిల్లాలో ఐదు మండలాలు, ములుగు జిల్లాలోని రెండు మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని రెండు మండలాలు కలిపి 9,674.42 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఐటీడీఏ పరిధి ఉంది.

చట్టాలు ఉన్నా అమలేది?

ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను అమలు చేస్తున్నాయి. కానీ, అవి సమగ్రంగా అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వం గిరిజనుల సమగ్రాభివృద్ధికి ఐటీడీఏను ఏర్పాటు చేసి దశాబ్దాలు దాటినా ఆదివాసీల జీవనంలో మార్పులు మాత్రం రాలేదు. అడవిని నమ్ముకుని జంతువుల మధ్యే జీవనం సాగించే గిరిపుత్రుల నివాసాలకు వెళ్లేందుకు కనీస దారులు లేక తాగేందుకు గుక్కెడు నీళ్లు లభించని పరిస్థితులు కనిపిస్తాయి. ఇక విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో మగ్గుతున్న గూడెంలు సైతం ఉన్నాయి. ఏళ్ల కిందట ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడకు వలస వచ్చిన ఆదివాసీలు స్థానికంగా నివాసం ఏర్పర్చుకున్నారు. కానీ, వీరిని ఎన్నికల సమయంలో మనుషులుగా, ఓటర్లుగా గుర్తిస్తున్న నాయకులు ఆ తర్వాత ఇటు ముఖం చూడకపోవడంతో సమస్యలు అలాగే మిగిలిపోతున్నాయి.

అటవీ ఫలసాయమే ఆధారం

గూడేలలో నివాసముంటున్న ఆదివాసీలు వ్యవసాయంతో పాటు అటవీ ఫలసాయమే జీవనాధారంగా బతుకుతున్నారు. కనీస రహదారి సౌకర్యం లేక నిత్యం కిలోమీటర్ల మేర కాలినడకన నడిచి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిందే. వర్షాకాలంలో అయితే ఆ బాట కూడా ఉండకపోతే అనారోగ్యం ఎదురైతే దేవుడిపై భారం వేసి గడపాల్సి వస్తోంది. విద్యుత్ సౌకర్యం కోసం ఐటీడీఏ ద్వారా పలు ఆదివాసీ గ్రామాల్లో సోలార్ లైట్లు బిగించినా అందులో అత్యధికం పనిచేయడం లేదు. ఇక తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. అటవీ శాఖ నిబంధనలతో బోర్లు వేయడం సాధ్యం కాక వాగులు, వంకలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈసారైనా పార్టీ అభ్యర్థులు తమ సమస్యలపై స్పష్టమైన హామీలు ఇవ్వాలని.. అప్పుడే ఓట్లు వేస్తామని ఆదివాసీలు తేల్చిచెబుతున్నారు.

భద్రాద్రి జిల్లాలోని ఆదివాసీగూడెంలు, జనాభా, ఓటర్లు

మండలం	గూడెంలు	జనాభా	ఓటర్లు
చర్ల	16	8,200	3,600
ములకలపల్లి	11	3,250	720
పాల్వంచ	10	3,500	632
కొత్తగూడెం	10	1,200	220
పినపాక	6	850	300
బూర్గంపాడు	5	1,400	980
మణుగూరు	5	360	980
దుమ్ముగూడెం	4	880	320
ఆళ్లపల్లి	2	670	107
గుండాల	1	42	68

గుక్కెడు నీళ్లకూ కష్టమే...



వేసవికాలం వచ్చిందంటే చాలు మాకు తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకక అవస్థ పడుతున్నాం. మైళ్ల దూరం వెళ్లి వాగులు, వంకలు, చెలిమల నుంచి నీటిని తెచ్చుకుంటే దాహార్తి తీరుతోంది. అటవీ శాఖ అభ్యంతరాలతో తాగునీటి అవసరాలకు బోర్లు కూడా వేయలేని పరిస్థితి ఉంది.

–సురేశ్

విద్యుత్, నీరు ఇచ్చిన వారికే ఓటు



విద్యుత్, తాగునీటి సమస్య పరిష్కరించేవారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నాం. అడవిలో జీవనం సాగిస్తున్న మా వద్దకు నాయకులు, అధికారులు ఎవరూ రారు. ఎన్నికల సమయాన నేతలు వచ్చినా ఆ తర్వాత పట్టించుకోరు. ఈసారైనా అవస్థలు తీర్చే వారికే ఓటు వేస్తాం.

–ఉంగి

కనీస సౌకర్యాలు కల్పించాలి



ప్రతీ ఐదు సంవత్సరాలకు నాయకులు మా ఓట్లు వేయించుకుంటున్నారు. కానీ, ఆ తర్వాత మమ్మల్ని మరిచిపోతున్నారు. ఆదివాసీ, గిరిజనులు నివాసం ఉండే గ్రామాల్లో కనీసం తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇస్తేనే ఈసారి ఓట్లు వేస్తాం.

–మంజు సురేశ్

భద్రగిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు

- పరస్పరం విరుచుకుపడ్డ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీలు
- అభివృద్ధి, ఓటింగ్‌పై బహిరంగ చర్చలకు రావాలని సవాల్

భద్రాచలం: సవాళ్లు, ప్రతి సవాళ్లతో భద్రాచలం నియోజకవర్గంలో రాజకీయ వేడి తారాస్థాయికి చేరుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు, కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలకు దిగారు. సోమవారం భద్రాచలంలో విడివిడిగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశాల్లో బహిరంగ చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుకున్నారు. దూషణలు చేసుకున్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు రా: బాలసాని లక్ష్మీనారాయణ



పరోక్ష ఎన్నికలతో ప్రజాప్రతినిధిగా ఉన్న తాతా మధు భద్రాచలంలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తాననడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో ఏ ఏ మండలాల్లో ఏ ప్రజా సమస్యలు ఉన్నాయో మధు చెప్పగలరా అని ప్రశ్నించారు. గిరిజన మాజీ సర్పంచ్ భూక్యా శ్వేతను పార్టీ మారాలంటూ మధు రాయబారాలు పంపారని, అవి పనిచేయకపోవడంతో అక్రమంగా పోలీసులతో అర్ధరాత్రి దాడులు చేయించారని ఆరోపించారు. భద్రాచలం అభివృద్ధికి బీఆర్ఎస్ ఏం చేసిందో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, నాయకులు చింతిరేల రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, వెంకటేష్, టీడీపీ నాయకులు కొడాలి శ్రీనివాస్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే నీ మండలంలో ఆధిక్యం తెచ్చుకో: తాతా మధు



'నీ సొంత మండలమైన వెంకటాపురంలో ఈ ఎన్నికలలో దమ్ముంటే కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం తెచ్చుకో బాలసానీ..' అంటూ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మండిపడ్డారు. సోమవారం పట్టణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్‌తో కలిసి మాట్లాడారు. గతంలో, ఇప్పుడు నీ సొంత మండలంలో పోలయ్యే ఓట్లకు, నా సొంత మండలంలో నా పార్టీకి పోలయ్యే ఓట్లపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. వ్యక్తిగత దూషణలకు దిగే నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరావు, కృష్ణమూర్తి, నాయకులు తిప్పన సిద్దులు, తాండ్ర వెంకటరమణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల కేటాయింపు పూర్తి


- పది నియోజకవర్గాల్లో 2,554 పోలింగ్ స్టేషన్లు
- అభ్యర్థుల సంఖ్య ఆధారంగా 4,376 బ్యాలెట్ యూనిట్లు

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ఈమేరకు అధికారులు బుధవారమే సామగ్రి తీసుకుని కేంద్రాలకు చేరుకుంటారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల సంఖ్య ఆధారంగా ఈవీఎంల కేటాయింపు పూర్తయింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 2,554 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో అభ్యర్థుల సంఖ్య ఆధారంగా బ్యాలెట్ యూనిట్లు కేటాయించారు. అన్ని కేంద్రాల్లో కలిపి 4,376 బ్యాలెట్ యూనిట్ల అవసరమని గుర్తించిన అధికారులు ఫస్ట్ లెవల్ చెకప్ పూర్తిచేశాక, నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చారు.

లెక్క ఇలా...

ఒక్కో ఈవీఎంలో 16మంది వరకు అభ్యర్థుల పేర్లు నమోదుకు వీలుంటుంది. అలాగే, ప్రతీ పోలింగ్ కేంద్రంలో 'నోటా'కు ఒక నంబర్ కేటాయిస్తారు. తద్వారా ఎక్కడైనా 16మంది అభ్యర్థులు ఉండి, నోటా కలిపితే సంఖ్య 17కు చేరడంతో రెండో ఈవీఎం ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని పాలేరులో 38మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా నోటాతో కలిపి 39, ఖమ్మంలో 32మంది పోటీ చేస్తుండగా నోటాతో కలిపి 33కి సంఖ్య చేరుతుంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్లలో మూడేసి ఈవీఎంలు ఏర్పాటుచేస్తున్నారు. ఇక పినపాక, ఇల్లెందు, సత్తుపల్లి, కొత్తగూడెంలో రెండేసి ఈవీఎంలు, మధిర, వైరా, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్లలో ఒక్కో ఈవీఎం ఏర్పాటుచేస్తారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	అభ్యర్థుల సంఖ్య (నోటాతో కలిపి)	ఒక్కో కేంద్రంలో బ్యాలెట్ యూనిట్లు	మొత్తం యూనిట్లు
పినపాక	244	19	2	488
ఇల్లెందు	241	21	2	482
ఖమ్మం	355	33	3	1,065
పాలేరు	289	38	3	367
మధిర	268	16	1	268
వైరా	252	13	1	252
సత్తుపల్లి	292	24	2	584
కొత్తగూడెం	253	31	2	506
అశ్వారావుపేట	184	15	1	184
భద్రాచలం	176	14	1	176



బీఆర్ఎస్, బీజేపీ తోడుదొంగలు

- ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎంను గెలిపించాలి
- పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్

దుమ్ముగూడెం/చర్ల : రాష్ట్రంలో, దేశంలో పాలన సాగిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు తోడు దొంగలుగా వ్యవహరిస్తున్నాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ విమర్శించారు. భద్రాచలం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న కారం పుల్లయ్య గెలుపును కాంక్షిస్తూ సోమవారం చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో నిర్వహించిన బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షో కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వం ఆదివాసీల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పాలకులు గ్రామసభ ఆమోదం, పీసా కమిటీల ఆమోదం లేకుండానే చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. ఆదివాసీల హక్కులను హరిస్తూ అటవీ సంపదను అదానీ, అంబానీ వంటి ప్రముఖుల కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. లొంగిపోయేవాళ్లం, అమ్ముడుపోయేవాళ్లం కాదని, ధనబలంతో వస్తున్న అభ్యర్థులను ఓడించాలని, ప్రజాబలంతో వస్తున్న సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్యను గెలిపించాలని పిలుపునిచ్చారు. కుంజా బొజ్జి, సున్నం రాజయ్యలు ప్రజా పోరాటాలు నిర్వహించిన ప్రాంతమని అన్నారు. ఆదివాసీ చట్టాలు, హక్కుల అమలు కోసం ఆది నుంచీ తమ పార్టీ పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. సీపీఎం పోరాటాల వల్లే ఆదివాసీలకు పోడు పట్టాలతోపాటు అటవీ హక్కుల చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చాయని పేర్కొన్నారు. కారం పుల్లయ్యను గెలిపిస్తే ప్రజా సమస్యలే పరిష్కారమే ధ్యేయంగా అసెంబ్లీలో కొట్లాడతారని అన్నారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి సీపీఎంను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్, నాయకులు బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, కొలగాని బ్రహ్మాచారి, కారం నరేష్, యలమంచి రవికుమార్, మర్మం చంద్రయ్య, యలమంచి వంశీకృష్ణ, బొల్లి సూర్య చంద్రావు, శ్రీనుబాబు సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వర్లు, కంగాల రాంబాబు, గోవర్ధన్, ఖాదర్ బాబు, బైరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజుపేట కాలనీకి చెందిన చిలకమ్మ వద్ద రూ.1500 విలువైన నాటుసారా, సూపర్‌బజార్‌కు చెందిన సందీప్ వద్ద రూ.2000 విలువైన మద్యం, సుందరయ్య నగర్ కాలనీకి చెందిన పవన్‌కల్యాణ్ వద్ద రూ.1700 విలువైన మద్యం సీజ్ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

మద్యం సీజ్

దమ్మపేట: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను ఎఫ్ఎస్ టీం, పోలీసులు సీజ్ చేశారు. సోమవారం దమ్మపేటలోని ప్రధాన రహదారిపై రెండు వేర్వేరు ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 224 మద్యం క్వార్టర్ సీసాలను పోలీసులు గుర్తించారు. ఈ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ, ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఖమ్మం మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి సీనియర్ మహిళ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు 61 మంది క్రీడాకారులు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన వారితో నిజామాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపిక చేశామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. జట్టుకు భవాని, స్వప్న, పూజిత, అఖిల, ప్రియాంక, కుసుమ, అశ్విని, నాగమణి, కావేరి, విజయ, శ్రీభాను, సంధ్య, భవాని, స్పందన, నిఖిత, వెనీల ఎంపిక కాగా, పోటీలను సీహెచ్.సుధాకర్, జి.శివజ్యోతి, జి.దివ్య, ఎం.సునీత, వి.సత్యనారాయణ, కె.లాలయ్య, ఐ.పవన్‌కుమార్, ఎం.శోభన్‌కృష్ణ పర్యవేక్షించారు.

కూనంనేనికే ఫార్వర్డ్ బ్లాక్ మద్దతు..

ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామరాజు



మాట్లాడుతున్న ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ సభ్యుడు రామరాజు, పక్కన సీపీఐ నేత నారాయణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో మిత్రపక్షాలు బలపరుస్తున్న సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామరాజు తెలిపారు. సోమవారం శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ వామపక్ష పార్టీలు పోటీ చేసే చోట పోటీ చేయకూడదని నిర్ణయించిందని, ఇందుకు విరుద్ధంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించారని, పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు బీ ఫాం ఎలా కేటాయించారని ప్రశ్నించారు. నేతాజీ ఆశయాలతో పనిచేస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ బీ ఫామ్ వామపక్ష వ్యతిరేకికి ఇవ్వడం సరికాదన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ కార్యకర్తలు కూనంనేని విజయానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణ ఆరోపణలు సరికాదు

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తమ పార్టీపై చేస్తున్న ఆరోపణలు సరికాదని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి జలగం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 42 చోట్ల తమ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జలగం కుమారుడు జలగం వెంకట్రావు మా పార్టీ (ఏఐఎఫ్‌బీ) సింహం గుర్తుపై కొత్తగూడెం నుంచి పోటీ చేస్తున్నారని తెలిపారు. వెంకట్రావు గెలుస్తాడనే అక్కసుతో నారాయణ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కమిటీకి, పార్టీ సభ్యత్వం తొలగించిన రామరాజు అనే వ్యక్తితో కొత్తగూడెంలో ప్రెస్‌మీట్ పెట్టించటం దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. అమ్ముకోవటం, అమ్ముడుపోవటం నారాయణకు అలవాటని, ఆ గుణాన్ని తమపై రుద్దవద్దని పేర్కొన్నారు. నాయకులు కోమటిరెడ్డి, తేజ్‌దీప్‌రెడ్డి, బండారి శేఖర్ పాల్గొన్నారు.

16 వాహనాలతో పాటు తారు ప్లాంట్ దగ్ధం

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల దుశ్చర్య



దగ్ధమైన వాహనం

చర్ల: రోడ్డు నిర్మాణ పనులను వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు పనులకు ఉపయోగిస్తున్న 16 వాహనాలతో పాటు ఒక తారు మిక్సింగ్ ప్లాంట్‌ను దగ్ధం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దంతెవాడ జిల్లాలోని బాన్సీ పోలీస్‌స్టేషన్ పరిధి దంతెవాడ – బైలడిల్లా మధ్య రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వీటిని నిలిపివేయాలంటూ మావోయిస్టులు పలుమార్లు హెచ్చరించారు. అయినా భారీ పోలీసు భద్రత మధ్య నిర్వహిస్తున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీ బాన్సీలోని పోలీస్‌స్టేషన్‌కు కిలోమీటర్ దూరాన క్యాంపు నిర్మించి తారు మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటుచేయడమే కాక సామగ్రి తీసుకొచ్చే వాహనాలను అక్కడే రాత్రి భద్రపరుస్తున్నారు. ఈ మేరకు ఆదివారం అర్ధరాత్రి సుమారు 1.30 గంటల ప్రాంతంలో క్యాంపు వద్దకు వచ్చిన మావోయిస్టులు వాచ్‌మెన్‌ను తుపాకీలతో బెదిరించి లోనకు వెళ్లి తారు మిక్సింగ్ ప్లాంట్‌తో పాటు జేసీబీ, ప్రొక్లెయినర్లు సహా 16 వాహనాలకు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయాయి. సుమారు 10 మంది మావోయిస్టులు ఆయుధాలతో రాగా, మిగిలిన సుమారు 100 మంది వద్ద కత్తులు, గొడ్డళ్లు, విల్లంబులు ఉన్నాయని తెలిసింది. మంటలు చెలరేగగానే బాన్సీ పోలీసులు వచ్చేలోగా వాహనాలు కాలిపోగా, సోమవారం ఉదయం ఉన్నతాధికారులు చేరుకుని పరిస్థితులను సమీక్షించారు.

రూ.3 కోట్ల నగదు స్వాధీనం

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం పరిధి వరంగల్ క్రాస్‌రోడ్డులోని శ్రీరాంనగర్‌లో ఓ ఇంటి నుంచి దాచిన రూ.3కోట్ల నగదును అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి అందిన సమాచారంతో తనిఖీకి వెళ్లగా, వీరిని గమనించిన ఇద్దరు వ్యక్తులు వెనుక గోడ దూకి పరారయ్యారు. దీంతో అధికారులు ఆదాయ పన్నుశాఖకు సమాచారం ఇవ్వగా అధికారులు వచ్చాక ఇంట్లో ఉన్న మహిళ సమక్షాన సోదాలు చేపట్టారు. ఈమేరకు రూ.3కోట్ల నగదుతో కూడిన మూడు బ్యాగులు లభించగా సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని మోదీ

140 కోట్ల మంది భారతీయులు సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నా: 'ఎక్స్'లో మోదీ


తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, తిరుపతి: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనార్థం ప్రధాని మోదీ ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రధానమంత్రి సోమవారం ఉదయం 9 గంటలకు మహాద్వారం వద్దకు చేరుకోగా, అర్చకులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి, వేదపండితులు ఆలయ మర్యాదలతో వేదమంత్రోచ్చారణ నడుమ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. మహాద్వారం నుంచి ఆలయంలోనికి ప్రవేశించిన ప్రధాని ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం బంగారు వాకిలి ద్వారా గర్భగుడిలోకి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి వైభవం, ప్రాశస్త్యం గురించి ప్రధానికి ఆలయ ప్రధాన అర్చకులు వివరించారు. ఆలయ జీయర్లు శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం వకుళామాతను ప్రధాని దర్శించుకున్నారు. అక్కడి నుంచి విమాన ప్రకారం మీదుగా విమాన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. ఆ తర్వాత వెండివాకిలి మీదుగా వెలుపలకు వచ్చిన ప్రధాని ధ్వజస్తంభాన్ని మొక్కారు. అనంతరం రంగనాయక మండపంలో ప్రధానికి వేద పండితులు ఆశీర్వచనం పలకగా, భూమన కరుణాకరరెడ్డి, ధర్మారెడ్డి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, టీటీడీ 2024 క్యాలెండర్, డైరీ, పంచగవ్యాలను అందజేశారు. అక్కడి నుంచి అతిథి గృహానికి చేరుకున్న ప్రధాని కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం అల్పాహారాన్ని స్వీకరించారు. ప్రధాని నరేంద్రమోదీ శ్రీవారిని దర్శించుకోవడం ఇది నాలుగోసారి. కాగా, తిరుమల శ్రీవారి దర్శనం సందర్భంగా 140 కోట్ల మంది భారతీయులకు మంచి ఆరోగ్యం, శ్రేయస్సు, అభివృద్ధి కలగాలని తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రార్థించానని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో వెల్లడించారు.


కార్తీక పౌర్ణమి సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లులో కార్తీక దీపోత్సవం

క్లుప్తంగా...

ప్రైవేట్ కార్యక్రమానికి రామయ్య ఉత్సవ విగ్రహాలు?

- అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజాదికాలకు మాత్రమే ఉపయోగించే స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఓ ప్రైవేట్ కార్యక్రమానికి తీసుకెళ్లడం వివాదాస్పదమైంది. భద్రాద్రిలోని అంతరాలయంలో ఉండే మూలమూర్తుల విగ్రహాల నమూనాలో ఉత్సవ విగ్రహాలను తయారు చేయించగా, వాటిని మాత్రమే స్వామివారికి జరిగే పూజాదికాల్లో ఉపయోగిస్తారు. ఇక ధర్మ ప్రచారం, గ్రామాల్లో జరిగే నిత్యకల్యాణాలకు ప్రచార రథంలోని విగ్రహాలను వినియోగిస్తారు. కానీ హైదరాబాద్‌లో ఇటీవల జరిగే ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ప్రచార రథంలోని విగ్రహాలతో పాటు ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నడూ భద్రాచలంలో ఆలయ ప్రాంగణం మినహా ఇతర ప్రదేశాల్లో జరిగే ఉత్సవాలకు వీటిని తీసుకెళ్లలేదు. అలాంటిది ప్రైవేట్ కార్యక్రమానికి ఉత్సవాల విగ్రహాలను తీసుకెళ్లడమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆలయ ఈవో రమాదేవిని వివరణ కోరగా ధర్మ ప్రచార నిమిత్తమే ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన విషయం తనకు తెలియదని చెప్పారు.

రూ.2.18 కోట్ల నగదు స్వాధీనం


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎఫ్ఎస్‌టీ అధికారులు

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో సీ–విజిల్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. ఆదివారంరాత్రి సీ–విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ కృష్ణానగర్‌లో తనిఖీలు చేసిందన్నారు. ఈ క్రమంలో ఓ తాళం వేసిన ఇంట్లో తనిఖీలు చేయగా, రెండు కోట్ల 18 లక్షల 90 వేల రూపాయల నగదు లభించిందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఆధారాలు లేనందున ఆ నగదు జప్తు చేశామని వివరించారు. రామగుండం బీ–పవర్‌హౌస్ రోడ్ వద్ద రూ.50 లక్షలు ఇప్పటికే జప్తు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఓ జాతీయ రాజకీయ పార్టీకి చెందిన కరపత్రాలు కూడా లభించినట్లు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ అధికారికి అప్పగించామని పేర్కొన్నారు.

'మోదీని దించితేనే దేశానికి భవిష్యత్తు'



మిర్యాలగూడ: ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి దేశాన్ని సర్వనాశనం చేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, మోదీని గద్దె దించితేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశ సంపదను మోదీ కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, కేంద్రం పేదల పక్షాన కాకుండా కార్పొరేట్ల కోసమే పనిచేస్తోందన్నారు. దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌరహక్కులను రద్దుచేసి కేంద్రం తమ సొంత ఎజెండాను ప్రజలపై రుద్దేందుకు చూస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం కాపాడటంలో ఎన్నికలు ఎంతో కీలకమని, ఎర్రజెండా నాయకులను గెలిపించి చట్టసభలకు పంపిస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అంతకుముందు వేములపల్లి నుంచి వాడపల్లి వరకు వేలాది వాహనాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్‌కు సంబంధం లేదు

- రైతుబంధు నిలిపివేతపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- సీఎం కేసీఆర్ తమపై నిందలు మోపడం తగదని హితవు


మెదక్ జిల్లా చిన్నగొట్టిముక్కులలో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే

నర్సాపూర్: రాష్ట్రంలో రైతుబంధు పథకం సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాకుండా నిలిచిపోవడానికి.. తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. సోమవారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కులలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించడంతో రైతుబంధును ఎన్నికల కమిషన్ నిలిపివేసిందని చెప్పారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం రైతుబంధుకు కాంగ్రెస్ పార్టీయే అడ్డుపడిందంటూ తప్పుడు ఆరోపణలు, నిందలు వేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ తప్పుడు మాటలను నమ్మొద్దని ఆయన రైతులను కోరారు. హామీల అమల్లో విఫలమైన కేసీఆర్... అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో తాము అధికారంలోకి రావడం ఖాయమని, ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే సోనియా..

దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని, ఆ కుటుంబాన్ని కేసీఆర్ దూషించడం ఎంత వరకు సమంజసమని ఖర్గే ప్రశ్నించారు. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చి కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టారని... సోనియా లేకుంటే కేసీఆర్ సీఎం అయ్యేవారా అని అన్నారు. తెలంగాణలో దొరల పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, దళితుడిని సీఎం చేస్తానంటూ గతంలో హామీ ఇచ్చిన కేసీఆర్... ముఖ్యమంత్రి పీఠం అధిష్టించి తన కుటుంబ సభ్యులకే పదవులు ఇచ్చారని దుయ్యబట్టారు. దేశంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చి విస్మరించిందని మండిపడ్డారు. కాళేశ్వరం, ఓఆర్ఆర్, పేపర్‌లీక్ తదితర స్కామ్‌ల ద్వారా తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు.

తక్షణమే ఆ ప్రకటనలను నిలిపివేయండి

- తెలంగాణ పత్రికల్లో కర్ణాటక ప్రభుత్వ ప్రకటనలపై ఈసీ ఆగ్రహం
- ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల సందర్భంగా తెలంగాణలోని ప్రముఖ పత్రికలలో కర్ణాటక రాష్ట్రం తరఫున ఇచ్చిన ప్రకటనలపై ఎన్నికల కమిషన్ ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సోమవారం వివరణ కోరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా ప్రకటనలను ప్రచురించడానికి ఈసీ నుంచి ముందస్తు అనుమతి పొందలేదని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనగా భావిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. ఎన్నికల కమిషన్ నుంచి అవసరమైన అనుమతులు తీసుకునే వరకు అటువంటి ప్రకటనల ప్రచురణను తక్షణమే నిలిపివేయాలని కూడా పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనపై మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు వివరణ ఇవ్వాలని కూడా ఆదేశాలు జారీ చేసింది. విధివిధానాలను ఉల్లంఘించినందుకు సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యదర్శిపై ఎందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కూడా లేఖలో ఆదేశించింది. కాగా, అంతకుముందు కర్ణాటక ప్రభుత్వం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి తెలంగాణ మీడియాలో ప్రకటనలు ఇస్తోందని ఆరోపిస్తూ బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ నాయకులు భూపేంద్ర యాదవ్, ప్రకాశ్ జవదేకర్, సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్, సుధాన్షు త్రివేది, ఓం పాఠక్‌లు ఫిర్యాదు చేశారు. పార్టీ ప్రయోజనాలను ప్రోత్సహించడానికి, ప్రచారాన్ని నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ వనరులు, ప్రజా నిధులను పూర్తిగా దుర్వినియోగం చేశారన్నారు. వీటన్నింటినీ అవినీతి పద్ధతులుగా పరిగణించాలని, ఈ ఖర్చులు తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల వ్యయ ఖాతాలో చేర్చాలని ఈసీని బీజేపీ కోరింది.

బీఆర్ఎస్‌కే గౌడ సంఘం మద్దతు

ఉప్పల్/పంజగుట్ట: ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు గౌడ్ అన్నారు. సోమవారం రామంతాపూర్ రామ్‌శంకర్ నగర్‌లో రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పాలకూరి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 13 కల్లు సొసైటీలను తెరిపించిందని, నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, వైన్‌షాపుల్లో పదిహేను శాతం రిజర్వేషన్లు కల్పించిందని, గౌడ సామాజిక భవనానికి కోకాపేటలో ఐదు ఎకరాల స్థలం, రూ.5 కోట్లు కేటాయించిందని చెప్పారు. కార్యక్రమంలో పాలకూరి దాస్ గౌడ్, వినయ్ కుమార్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, హైదరాబాద్‌లో కల్లును నిషేధించి 46 మంది గౌడ కులస్థుల ఆత్మహత్యలకు కారణమైన కాంగ్రెస్‌కు గౌడ కులస్థులందరూ ఓటుతో బుద్ధిచెప్పాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మనగౌడ సంఘం అధ్యక్షుడు రామారావుతో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలోనే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా చేస్తున్నారని, రూ.మూడు కోట్లతో ఆయన విగ్రహం ట్యాంక్‌బండ్‌పై పెట్టారని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌కు ఆర్టీసీ ఉద్యోగుల మద్దతు

పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు 10 లక్షల మంది కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థామ రెడ్డి కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు చెన్నారెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు హయాంలో ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 15 శాతం ఉన్న పన్నును 6 శాతానికి తగ్గించి ఆర్టీసీని కాపాడారని గుర్తు చేశారు. సమావేశానంతరం ప్రెస్‌క్లబ్‌కు వచ్చిన మాజీ కేంద్రమంత్రి జయరామ్ రమేష్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌లను కలసి కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు చెప్పడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఐటీ దాడులతో కలకలం

- అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరుల ఇళ్లలో తనిఖీలు


పేట మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఐటీ అధికారులు

నారాయణపేట: ఎన్నికల వేళ అధికార పార్టీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులపై ఐటీ అధికారులు దాడులు చేపట్టడంతో పట్టణంలో కలకలం రేగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్ ఇంటితోపాటు బంగారు నగల దుకాణం, మరో వ్యాపారి బన్సీలాల్ లాహోటి, డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి ఇళ్లలో ఐటీ అధికారుల బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. సోమవారం తెల్లవారుజామున 6 గంటల నుంచి మొదలైన తనిఖీలు రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. 14 గంటలు దాటినా తనిఖీలు కొనసాగడంతో ఏం జరిగిందోననే చర్చ జరిగింది. హరినారాయణ భట్టడ్, బన్సీలాల్ లాహోటి వ్యాపారులు కావడంతో వారి ఇళ్లలో సహజంగా డబ్బులు ఉంటాయని.. కానీ, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఇంట్లో ఇంత సమయం ఎందుకు తనిఖీలు కొనసాగుతున్నాయని ప్రజలు చర్చించుకున్నారు.

జిల్లా వార్తలు

గోదావరి నదిలో దీపాలు వదిలేందుకు బురదలో వస్తున్న మహిళ



నదిలోకి దిగే క్రమంలో జారి పడిన మహిళ, చిన్నారి



బురద గోదారి..

కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు భద్రాచలం చేరుకున్నారు. అయితే గోదావరి తీరంలో భారీగా పేరుకుపోయిన బురద వారికి చుక్కలు చూపించింది. అడుగు తీసి అడుగేయాలంటే ఒకరిద్దరి సాయం తీసుకోవాల్సి వచ్చింది. గత జూలైలో వచ్చిన వరదలతో స్నానఘట్టాలతో పాటు గోదావరి తీరమంతా ఒండ్రుమట్టి భారీగా చేరింది. స్నానఘట్టాల వద్ద ఒండ్రు తొలగించేందుకు చర్యలు చేపట్టిన అధికారులు పక్కన మాత్రం అలాగే వదిలేశారు. కార్తీక పౌర్ణమి సోమవారం కావడంతో భక్తులు భారీగా వస్తారని అధికారులకు ముందే తెలిసినా శుభ్రం చేయడంలో మాత్రం అలసత్వం వహించారనే విమర్శలు వెల్లువెత్తాయి. స్నానాలు చేసేందుకు నదిలోకి వెళ్లే క్రమంలో పలువురు మహిళలు, చిన్నారులు బురదలోనే జారి కిందపడ్డారు. దీంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. – భద్రాచలంటౌన్


గాదె ఇన్నయ్యసహా ఐదుగురిపై 'ఉపా' కేసులు

- మావోయిస్టు పార్టీ నేత పుల్లూరి ప్రసాద్‌రావుపై కూడా..
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మలిదశ తెలంగాణ ఉద్యమనేత గాదె ఇన్నయ్యసహా ఐదుగురిపై 'ఉపా' చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిపేట శివారులోని పోలీసులు ఇటీవల వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారు ఆపకుండా వెళ్లింది. పోలీసులు దానిని వెంబడించి అడ్డుకోగా అందులో గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన గాడిచెర్ల శ్రీనివాస్(40) ఉన్నారు. అతడిని విచారించగా, నిషేధిత మావోయిస్టు పార్టీ నేత పుల్లూరి ప్రసాద్‌రావు ఉరఫ్ చంద్రన్నను కలిసేందుకు ఛత్తీస్‌గఢ్ వెళ్తున్నట్లు చెప్పాడు. గతంలో చంద్రన్న ఆదేశాల మేరకు రూ.25 లక్షల పార్టీ చందాలను వేర్వేరు సందర్భాల్లో గాదె ఇన్నయ్య, జెంజర్ల రమేశ్, ఎంఎఫ్ గోపినాథ్‌లకు అందజేసినట్లు శ్రీనివాస్ చెప్పారు. భారత్ బచావో పార్టీ అభివృద్ధి కోసం ఈ డబ్బులను ఇచ్చినట్లు వెల్లడించారు. శ్రీనివాస్ వద్ద పేలుడు పదార్థాలు, హ్యుందాయ్ కారు, విప్లవ సాహిత్యం, పార్టీ కోసం వసూలు చేసిన డబ్బులు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎస్.రమాకాంత్ తెలిపారు. గాడిచెర్ల శ్రీనివాస్‌తోపాటు పుల్లూరి ప్రసాద్‌రావు, గాదె ఇన్నయ్య, జెంజర్ల రమేశ్, ఎంఎఫ్ గోపినాథ్‌పై ఉపా చట్టం కింద ఈ నెల 18న ఉపా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, ఇన్నయ్యసహా ఐదుగురిపై నమోదు చేసిన బూటకపు కేసులను ఎత్తేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

లంబాడీలను టార్గెట్ చేస్తున్న కాంగ్రెస్


- సీఎం కేసీఆర్ పాలనలోనే బంజారాల అభివృద్ధి
- మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్


కామేపల్లి : మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

కామేపల్లి/టేకులపల్లి: లంబాడీలను లక్ష్యంగా చేస్తున్న కాంగ్రెస్ అన్నిరంగాల్లో తొక్కిపెట్టాలని చూస్తోందని, ఈ ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతామని మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ వెల్లడించారు. కామేపల్లి మండలం కొత్తలింగాల, టేకులపల్లిలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనులపై చిన్నచూపు చూస్తూ జనాభాకు అనుగుణంగా టిక్కెట్లు కేటాయించలేదని ఆరోపించారు. తెలంగాణ జనాభాలో ఏడు శాతం ఉన్న గిరిజనుల్లో ఐదుగురికే టిక్కెట్లు ఇచ్చిందన్నారు. ఇక బీజేపీ తీరు కూడా అలాగే ఉందని పేర్కొన్నారు. కాగా, సీఎం కేసీఆర్ తండాలను ప్రత్యేక పంచాయతీలుగా చేశారని, పోడు భూములకు పట్టాలు అందజేశారని సీతారాంనాయక్ తెలిపారు. కేసీఆర్ పాలనలోనే గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు అంది అభివృద్ధి చెందినందున మరోమారు కేసీఆర్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ ఎంత హడావుడి చేసినా ఇల్లెందులో బానోతు హరిప్రియ గెలవడం, రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమని సీతారాంనాయక్ తెలిపారు. ఈ సమావేశాల్లో జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, నాయకులు ధనియాకుల హన్మంతరావు, రామచంద్రనాయక్, దేవీలాల్, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, అంతోటి అచ్చయ్య, కేలోత్ భాస్కర్, దేవీలాల్, డాక్టర్ రామచంద్రనాయక్, బోడ బాలు, రామ, కిషన్, చీమల సత్యనారాయణ, వాసు, బాలాజీ, లాలు, జగన్, రవి, తులసీరాం, కోట్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కే అధికారం

ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ దీపక్ బైజు


మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజు

పాల్వంచ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ దీపక్ బైజు తెలిపారు. పాల్వంచలోని పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనని, తెలంగాణ ప్రజాధనాన్ని బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో లూటీ చేసిందని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకు పైగా గెలిచి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, కొత్తగూడెంలో సీపీఐ నేత కూనంనేని సాంబశివరావుకు మద్దతు ప్రకటించినందున కాంగ్రెస్ శ్రేణులను ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం బెల్లయ్యనాయక్ మాట్లాడగా నాయకులు నాగ సీతారాములు, కొత్వాల శ్రీనివాసరావు, నూకల రంగారావు, కిశోర్, జోషి, సోమయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

అవి ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీలు

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- రైతుబంధుపై ఆ రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయి...
- రాహుల్ అంత చేతగాని రాజకీయ నేత మరొకరు లేదని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ఫ్యామిలీ ప్రైవేట్ లిమిటెడ్ పార్టీలుగా మారిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై పోరాడేది తామేనని, తెలంగాణ ప్రజలు, భావి తరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తమ పార్టీని గెలిపించాలని కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ వేలాది కోట్లు ఖర్చు చేస్తూ ఎంఐఎం మధ్యవర్తిత్వంతో బీజేపీ గెలవకుండా కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం పార్టీ నాయకులు డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, సోలంకి శ్రీనివాస్, సునీతారెడ్డి, అమర్‌నాథ్, జి. వెంకటరెడ్డి, మానికతో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల అమలు ఎలా అనేది కోటి డాలర్ల ప్రశ్న అని వ్యాఖ్యానించారు. ఈ గ్యారంటీల అమలుకు తెలంగాణకు ఇప్పుడొస్తున్న రెవెన్యూకు మూడింతలు డబ్బు అవసరమని లెక్క వేశారు.

ఇక్కడ ఎన్నికలకు కర్ణాటక ప్రభుత్వ యాడ్స్ ఎలా ఇస్తారు ?

తెలంగాణలో ఏ ప్రాతిపదికన కర్ణాటక ప్రభుత్వ డబ్బుతో కాంగ్రెస్ ప్రకటనలు ఇస్తుందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఇక్కడ ఎన్నికల కోసం కర్ణాటకలోని కాంట్రాక్టర్లు, ఐటీసంస్థలు, వ్యాపారులను బెదిరించి వేల కోట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థుల్లో 50 శాతం మందికి కేసీఆర్, మరో 50 శాతం మందికి కర్ణాటక సర్కార్ ఖర్చు చేస్తోందని నిందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల దోస్తీ, కాంగ్రెస్ కేంద్ర కేబినెట్‌లో కేసీఆర్ మంత్రిగా పనిచేయడం, కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నాలు వంటి అంశాలపై రాహుల్‌గాంధీ చర్చకు రావాలని కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది దూప్ ఫైట్...

'ఎన్నికల నేపథ్యంలో...కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది దూప్ ఫైట్...రాహుల్‌గాంధీ అంత చేతగాని రాజకీయనాయకుడు మరొకరు లేడు'అని కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి నిర్వహణ చేతకాదంటూ వదులుకున్న వ్యక్తి రాహుల్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైద్యకళాశాలల ఏర్పాటు కోసం కేసీఆర్ రాసినట్టు చెబుతున్న 50 లేఖలు చూపిస్తే తాను రాజకీయాల నుంచి విరమించుకుంటానని సవాల్ విసిరారు.

రైతుబంధుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు..

'రైతుబంధుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలాడుతున్నాయి బీఆర్ఎస్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే నోటిఫికేషన్‌కు ఒక రోజు ముందుగానే రైతుబంధు ఎందుకు ఇవ్వలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో ఫిర్యాదు చేయించడం ద్వారా బీఆర్ఎస్‌కు ఇది ఇవ్వడం ఇష్టం లేదని తేలిందన్నారు.

హైదరాబాద్ పేరు మారుస్తాం...

బీజేపీ అధికారానికి వస్తే హైదరాబాద్ పేరును కచ్చితంగా భాగ్యనగర్‌గా మార్చేస్తామని ఒక ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిచ్చారు. 'ఎవరైనా బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటంటే.. లాగి చెప్పుదెబ్బ కొట్టండి...ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరితో కలిసే ప్రసక్తే లేదు'అని తీవ్రంగా స్పందించారు.

భారజల కర్మాగారాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు

అశ్వాపురం: మణుగూరులోని భారజల కర్మాగారాన్ని ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారుల బృందం సోమవారం సందర్శించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల పరిశీలకుడు కమల్‌కిషోర్‌సన్‌తోపాటు గణేష్, జయంత్‌సింగ్, అజయ్‌లాల్‌చంద్‌సోజీనీ, సంజీవ్‌కుమార్‌పాల్, కోటేశ్వర కర్మాగారాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు ప్లాంట్‌లో వివిధ విభాగాలను పరిశీలించాక అధికారులతో సమావేశమై విభాగాల పనితీరు, రక్షణ చర్యలపై తెలుసుకున్నారు. కర్మాగారం జీఎం జగ్గారావు, అధికారులు శ్రీనివాసరావు, హెచ్‌కే.శర్మ, విశ్వనాథ్, వేణు, మోహన్‌కుమార్, వీరేంద్రనాథ్, శర్మ, రాఖీప్రకాష్‌కుమార్ పాల్గొన్నారు.